andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.9, కనిష్ఠం 14.5

నిర్మల్
జిల్లా వార్తలు
8
మంగళవారం 2 జనవరి 2024

ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

ఖానాపూర్, జనవరి 1 : ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఖానాపూర్ అయ్యప్ప ఆలయ కమిటీ బృందం ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావును కోరారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఎంపీని ఆదిలాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేసినట్లు వారు ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ విన్నపం మేరకు ఆలయ అభివృద్ధి కోసం రూ. 20 లక్షల నిధులను మంజూరు చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఎంపీని కలిసిన వారిలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఏ. రాజన్న, సట్ల శంకర్, సాయికృష్ణ, తదితరులున్నారు.



కంటివెలుగు డబ్బులేవి?





- మే, జూన్ నెలల డబ్బుల చెల్లింపులో చేతులెత్తేసిన యంత్రాంగం
- వాహనాల అద్దెలు, భోజన ఖర్చులు, కొంతమంది సిబ్బంది బిల్లులు సైతం ఎగవేత
- డీ యం అండ్ హెచ్ ఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితులు
- తమకు సంబంధం లేదంటున్న జిల్లా అధికారులు
- జిల్లాస్థాయిలోనే పరిష్కరించుకోవాలని చెబుతున్న రాష్ట్ర అధికారులు
- ఇంతకూ డబ్బులు వస్తాయా.. రావోనని బాధితుల ఆందోళన

నిర్మల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : అప్పటి కేసీఆర్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమానికి సంబంధించి చివరి రెండు నెలల డబ్బుల చెల్లింపుల్లో చేతులెత్తేసిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభమై జూన్ 15వ తేదీ దాక సాగిన కంటివెలుగు కార్యక్రమంలో భారీ ఎత్తున నిధులు ఖర్చు చేశారు. సహాయ అప్తాల్మిక్ అధికారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లను ఒప్పంద ప్రతిపాదికన అప్పటి ప్రభుత్వం నియమించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమంలో వీరితో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ఏఎన్‌యంలు, ఆశ కార్యకర్తలు, పర్యవేక్షక సిబ్బంది సైతం పాల్గొన్నారు. వీరికి తోడుగా అద్దె వాహనాలను, డ్రైవర్‌లను తీసుకొని కార్యక్రమాన్ని సజావుగా పూర్తి చేసేందుకు అప్పటి అధికారులు చర్యలు తీసుకున్నారు. తొలి రెండు నెలలు బాగానే జరిగినప్పటికి కార్యక్రమం చివరలో మే, జూన్ నెలలకు సంబంధించిన డబ్బుల చెల్లింపుల్లో అధికార యంత్రాంగం చేతులేత్తేసిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆరు నెలలు గడుస్తున్నా..

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం పూర్తయ్యి ఆరు నెలల గడుస్తున్నది. 33 జిల్లాలకు కంటి వెలుగుకు సంబంధించి నిధులను విడుదల చేసినట్లు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అప్పట్లోనే ప్రకటించారు. అయితే మే, జూన్ నెలలకు సంబంధించి అనేక జిల్లాల్లో అప్తాల్మిక్ సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లకు వేతనాలు చెల్లించలేదని చెబుతున్నారు. అలాగే మరికొన్ని జిల్లాల్లో భోజన వసతికి సంబంధించిన నిధులు విడుదల కాలేదు. అనేక జిల్లాల్లో వాహనాల అద్దెకు సంబంధించి ప్రైవేటు వాహనాలకు ప్రతీనెల రూ.33వేలు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. వీటికి సంబంధించిన చెల్లింపులు కూడా అనేక జిల్లాల్లో జరగలేదని వాహనాల యజమానులు చెబుతున్నారు. ఇదిగో వస్తాయి... అదిగో వస్తాయి అంటూ జిల్లాల డీయంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయాల నిర్వహణ అధికారులు చెబుతున్నారు. అయితే ఆ డబ్బులకు సంబంధించి ఆరునెలలు గడుస్తున్నప్పటికీ స్పష్టత లేకపోవడంపై వాహనాలను అద్దెకు ఇచ్చిన యజమానులు, డ్రైవర్‌లు ఆందోళన చెందుతున్నారు. ఒక్క నిర్మల్ జిల్లాలోనే సుమారు రూ. 15 లక్షలకు పైగా బిల్లులు చెల్లించలేదని సమాచారం. మరోవైపు ఆరోగ్య సిబ్బంది సెకండ్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌లుగా పనిచేసిన వారికి రోజుకు రూ.100 చొప్పున చెల్లించాల్సిన డబ్బులు కూడా ఇంకా వారికి ఇవ్వలేదు. ఇలా కంటి వెలుగుకు సంబంధించి భారీగా డబ్బులు చెల్లించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అసలు వస్తాయా.. రావా?

కంటి వెలుగు నిర్వహణకు సంబంధించి మే, జూన్ నెలల్లో చెల్లించాల్సిన వివిధ రకాల డబ్బుల చెల్లింపులు అసలు జరుగుతాయా లేవా..? తమకు డబ్బులు వస్తాయా రావా అన్న ఆందోళన బాధితుల్లో నెలకొని ఉంది. ఆరు నెలలు గడుస్తున్న ఇంత వరకు చెల్లింపులు జరగలేదంటే నిధులు పక్కదారి పట్టాయేమోనన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. జిల్లాస్థాయిలో అధికారులను అడిగితే బిల్లులు రాష్ట్ర అధికారులకు పంపామని చెబుతున్నారు. ఇంతకు మించి తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని సెలవిస్తున్నారు. ఇదే విషయమై రాష్ట్ర అధికారులను అడిగితే తమ ఆధీనంలో ఈ సమస్య రాదని జిల్లాస్థాయిలోనే పరిష్కరించుకోవాలని చెబుతున్నారు.

విచారణ జరుపుతాం

రాష్ట్ర వ్యాప్తంగా కంటి వెలుగుకు సంబంధించి అన్ని జిల్లాలకు నిధులు రాష్ట్ర కార్యాలయం ద్వారా పంపించాం. కొన్ని చోట్ల డబ్బులు చెల్లింపులతో పాటు వాహనాల అద్దె ఇంకా ఇవ్వనట్లు మాకు కూడా సమాచారం ఉంది. అయితే ఆలస్యంగా బిల్లులు సబ్‌మిట్ చేసిన కారణంగానే చెల్లింపుల్లో జాప్యం జరిగి ఉండవచ్చు. తమ రాష్ట్ర కార్యాలయంలో ఎలాంటి పెండింగ్‌లు లేవు. జిల్లాల్లో ఎందుకు విడుదల కాలేదో విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

\- వినయ్, అకౌంట్స్ అధికారి,
రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం



అమ్మవారిని దర్శనానికి క్యూలైన్‌లలో వేచి చూస్తున్న భక్తులు

బాసరలో భక్తుల సందడి

- కొత్త సంవత్సరం తొలిరోజు అమ్మవారి దర్శనాలు

బాసర, జనవరి 1 : బాసర సరస్వతీ అమ్మవారి నిలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. వారుస సెలవుదినాలు, కొత్తసంవత్సరం తొలిరోజు పురస్కరించుకొని భక్తుల రద్దీ పెరిగింది. బాసర ప్రాంతంలో పాటు మహారాష్ట్ర తెలుగు రాష్ట్రాల సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు హాజరయ్యారు. ఈ కొత్త సంవత్సరం అంత బాగుండాలని కోరుకుంటూ అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆలయంలోని రెండు అక్షరాభ్యాస మండపాల్లో పూజలు అధికంగా నమోదయ్యాయి. దినమంత భక్తుల రద్దీ కొనసాగింది.

అమ్మవారిని దర్శించుకున్న నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే



బాసరలో గుడిలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

బాసర, జనవరి 1 : నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ ధన్‌పాల్ సోమవారం బాసర సరస్వతీ అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. సరస్వతీ అమ్మవారిని దర్శించుకొని ఆయన ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి ఆలయ పండితులు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. అంతకుముందు ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు స్థానిక బీజేపీ నాయకులు స్వాగతం పలికారు.


భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



కల్లూర్ సాయిబాబా ఆలయంలో భక్తులు

కుంటాల, జనవరి 1 : సోమవారం ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురష్కరించుకొని మండల కేంద్రం కుంటాలతో పాటు కల్లూర్ సాయిబాబా ఆలయం ఓలా, సూర్యాపూర్ శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు నిర్వాహకులు అన్ని ఏర్పాటు చేశారు.

సాయిబాబా ఆలయానికి పోటెత్తిన భక్తులు



నిర్మల్ కల్చరల్, జనవరి 1 : నూతన ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా సోమవారం నిర్మల్‌లోని గండి రామన్న సాయిబాబా ఆలయానికి భక్తులు పోటెత్తారు. సాయిబాబా ఆశీస్సులు తీసుకున్నారు. సాయినాథుడికి ప్రత్యేకపూజలు చేశారు. దత్తాత్రేయ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

‘కదిలి’ వచ్చిన భక్త జనం

- జన సంద్రమైన పాపన్న లొద్ది
- కొత్త సంవత్సరం కలిసి రావాలని మొక్కులు



పాపహరేశ్వర స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



కదిలి ఆలయంలో భక్తుల సందడి

దిలావర్‌పూర్, జనవరి 1 : భక్తుల కొంగుబంగారం కదిలి పాప హరేశ్వర స్వామి కొలువైన పాపన్న లొద్ది సోమవారం వేలాదిగా తరలివచ్చిన భక్తుల జన సంద్రంగా మారింది. నూతన సంవత్సరం మొదటి రోజు సోమవారం కలిసి రావడంతో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తమ ఇష్ట దైవమైన పాప హరేశ్వరస్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. స్వామివారి దర్శన భాగ్యం కోసం భక్తులు గంటల తరబడి బారులు తీరారు. గోముఖ గుండంలో పవిత్ర స్నానాలు చేసిన భక్తులు అన్నపూర్ణేశ్వరి సమేత పాప హరేశ్వర స్వామిని దర్శించుకున్నారు. 18 వృక్షాలతో కూడిన మహా వటవృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్వామివారి సన్నిధిలోనే కొలువైన నాగదేవతకు కొబ్బరి కాయలు కొట్టి పిల్లా పాపలను, పశు పక్షాదులను చల్లంగా చూడాలని, నూతన సంవత్సరం కలిసి రావాలని మొక్కుకున్నారు. ‘కదిలి’ వచ్చిన భక్తులకు కదిలి పాపహరేశ్వర స్వామి సేవాదళ్ వాలంటీర్లు సేవలందించారు. దేవస్థానం చైర్మన్ నర్వాడీ వెంకట్‌రావు పాటిల్ ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణ చేశారు. సోమవారం దాదాపు 20 వేల మంది భక్తులు వచ్చినట్లు అంచనా వేశారు.

కదిలిలో అయ్యప్ప మహా పడి పూజ

శ్రీ కదిలి పాపహరేశ్వర స్వామి సన్నిధిలో సోమవారం దేవస్థానం పాలకవర్గం ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకం పూజలు చేశారు. అయ్యప్పస్వామి మాలధారణ చేసిన భక్తులు స్వామివారి భక్తి గీతాలను ఆలపించారు. అయ్యప్ప స్వామి నామ స్మరణతో కదిలి లొద్ది మార్మోగింది. భక్తులకు స్వామివారి పంచామృతాన్ని పంచి పెట్టారు.



అయ్యప్ప స్వామికి అభిషేక పూజలు చేస్తున్న భక్తులు



అయ్యప్ప పూజలో పాల్గొన్న భక్తులు

అసత్యపు ఆరోపణలు చేస్తున్న కౌన్సిలర్ రాజుర సత్యంపై చర్యలు తీసుకోండి

- తిమ్మాపూర్, ఖానాపూర్ వీడీసీ బృందాల ఫిర్యాదు



కౌన్సిలర్ సత్యంపై ఖానాపూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వీడీసీ బృందాలు

ఖానాపూర్, జనవరి 1 : ఖానాపూర్, తిమ్మాపూర్ వీడీసీ బృందాలపై అసత్య ఆరోపణలు చేసిన 11వ వార్డు కౌన్సిలర్ రాజుర సత్యంపై చర్యలు తీసుకోవాలని తిమ్మాపూర్, ఖానాపూర్ వీడీసీ బృందాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రాజుర సత్యంపై వీడీసీల ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... తాము కౌన్సిలర్లను ఖానాపూర్‌లో తిరగనివ్వమని భయపెడుతున్నట్లు అసత్య ఆరోపణలు చేస్తూ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన సత్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీడీసీ బృందాలపై, గ్రామ పెద్దలపై పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేయడమే కాకుండా సోషల్ మీడియా వేదికగా తీవ్రమైన ఆరోపణలు చేయడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉన్న ఖానాపూర్ పట్టణంలో ఉద్రేకాలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్న కౌన్సిలర్ సత్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై తాము జిల్లా ఎస్పీకి సైతం ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ వీడీసీ అధ్యక్షులు సతీష్‌రావు దేశ్‌పాండే, తిమ్మాపూర్ వీడీసీ అధ్యక్షులు బీసీ రాజన్న, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కల్వకుంట్ల నారాయణ, వీడీసీ నాయకులు పుప్పాల మురళి, మైలారపు గంగాధర్, మధిరే సత్యనారాయణ, కథలాపురం గంగ నర్సయ్య, పరాంకుశం శ్రీనివాస్, ద్యావతి రాజేశ్వర్, నేత శ్యామ్, నర్సయ్య, నాగరాజు, దేవేందర్, తదితరులున్నారు.

కలాం ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యవర్గం

నిర్మల్ కల్చరల్, జనవరి 1 : ఏపీజే కలాం ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా మహమ్మద్ అజారుద్దీన్, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ పర్వేజ్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ ఖాసిం, కోశాధికారిగా షేక్ సిరాజ్, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

శాలివాహన కుమ్మర సంఘం

కుంటాల, జనవరి 1 : మండల శాలివాహన కుమ్మరి కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కుమ్మరి కట్లకుంట గంగాధర్, ఉపాధ్యక్షుడిగా రాజరాం దామోదర్, ఆమెడ లక్ష్మణ్, సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి గౌరవ అధ్యక్షుడు కొత్తపెల్లి బుచ్చన్న సన్మానించి అభినందించారు.

అడెల్లి అభివృద్ధి కమిటీ సభ్యుల ఆందోళన



నిర్మల్ - స్వర్ణ రహదారిపై ఆందోళన చేస్తున్న వీడీసీ సభ్యులు

సారంగాపూర్, జనవరి 1 : మండల కేంద్రంలో గల బస్టాండ్ సమీపంలో నిర్మల్ - స్వర్ణ రహదారిపై సోమవారం అడెల్లి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గతంలో పశువుల కోసం 5 గుంటల స్థలాన్ని కొనుగోలు చేయడం జరిగిందని ఆ పశువుల స్థలాన్ని గ్రామానికి చెందిన వ్యక్తి కబ్జా చేసి అక్రమ పట్టా చేసుకున్నాడని, కబ్జా చేసిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆరోపించారు. ఈ విషయాన్ని సదరు వ్యక్తిని ప్రశ్నిస్తే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వెల్లడించారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా కబ్జా చేసిన భూమిని గ్రామ పంచాయతీకి అప్పగించి సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులు వరి నాట్లను సకాలంలో వేసుకోవాలి



స్వర్ణ ప్రాజెక్టు కాలువ ద్వారా నీరును విడుదల చేస్తున్న దృశ్యం

సారంగాపూర్, జనవరి 1 : రైతులు రబీలో సాగు చేసే వరి నాట్లను సకాలంలో వేసుకోవాలని జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలో గల స్వర్ణ ప్రాజెక్టు కాలువ ద్వారా నీరును విడుదల చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతు సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తున్నారని, రైతుశ్రేయస్సే దిశగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దశరథ్ రాజేశ్వర్, బి.నర్సయ్య, ఆదిలక్ష్మణ్, భోజగౌడ్, సురేందర్‌లతో పాటు అధికారులు ఉన్నారు.

యాచకులతో కలిసి కానిస్టేబుల్ న్యూ ఇయర్ వేడుకలు

నిర్మల్ కల్చరల్, జనవరి 1 : నిర్మల్ పట్టణ ట్రాఫిక్ కానిస్టేబుల్ నవీన్‌సింగ్ న్యూ ఇయర్ వేడుకలను వినూత్నంగా యాచకులతో కలిసి చేసుకున్నారు. మంచిర్యాల చౌరస్తా వద్ద వారికి శుభాకాంక్షలు తెలిపారు. వారితో కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు.

ఏఎంఆర్ టవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు

నిర్మల్ అర్బన్, జనవరి 1 : నిర్మల్ పట్టణంలోని ఏఎన్ రెడ్డి కాలనీలో గల ఏఎంఆర్ టవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొరిపెల్లి లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సాయి కృష్ణారెడ్డి, కోశాధికారిగా తోట శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అసోసియేషన్ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోవర్ధన్‌రెడ్డి, వి. శ్రీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


తలమడుగులో 18 మెట్ల పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులు


ధ్వజారోహణ నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

తలమడుగు, జనవరి1: మండల కేంద్రంలో అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో ఘనంగా 18 మెట్ల అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక రైతు వేదికలో దాదాపు 40 మంది స్వాములు అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప గురుస్వాములు మాట్లాడుతూ ఎంతో భక్తిశ్రద్ధలతో 41 రోజులు అయ్యప్ప స్వామి దీక్ష చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతీ రోజు ఒంటి పూట భోజనంతో నియమ నిష్ఠలతో స్వామి వారిని పూజించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంభాగా అయ్యప్ప స్వామి యొక్క 18 మెట్ల పూజ కార్యక్రమాన్ని అయ్యప్ప స్వామి దీక్షపరులు గ్రామస్థుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తిశ్రద్ధలతో భజన చేస్తూ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో ఆలయ కమిటీ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, గురుస్వాములు పద్మాకర్‌రెడ్డి, శివన్న, వెంకన్న, ఇంద్రసేనారెడ్డి, లింగన్న, శ్రీకాంత్ గురుస్వాములు, అయ్యప్ప దీక్షాపరులు తదితరులు పాల్గొన్నారు.

● అయ్యప్పకు ప్రత్యేక పూజలు

ఉట్నూర్: మండల కేంద్రంలోని హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి ఆలయం ఎనిమిదో వార్షికోత్సవం ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసిన కార్యక్రమంలో ముందుగా ధ్వజారోహణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప విగ్రహాలకు అభిషేకం కార్యక్రమాలు పూర్తి చేసిన వేద పండితులు రజనీష్‌శర్మ, దీపక్‌దుబేలు హోమం, గణపతిపూజ, పుణ్యావచనం, నవగ్రహ హోమం, మూలవిరాట్టు అభిషేకం మృత్యుంజయ హోం, పూర్ణాహుతి సంప్రోక్షణ, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆడే దన్‌లాల్, రాథోడ్ భీమ్‌రావు, శ్రీనివాస్, కాలేరిగంగాధర్, యాదగిరిగౌడ్, నాగభషణం తదితరులు పాల్గొన్నారు.

● అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన సోనాల

బోథ్: సోనాల మండల కేంద్రంలోని రామాలయంలో సోమవారం అయ్యప్ప పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. మొదట భక్తులు పల్లకీ ఊరేగించిన అనంతరం రామాలయంలో పడిపూజ కార్యక్రమాన్ని వేద పండితులు అనిల్ శర్మ చేతుల మీదుగా కొనసాగింది. అయ్యప్పకు 18 మెట్లతో ఏర్పాటు చేసిన మందిరంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృత అభిషేకం గావించారు. కార్యక్రమంలో శ్రీకాంత్ ఆర్కెస్ట్రా బృందం వారితో పాటు కౌటా(బి) గ్రామానికి చెందిన గురు స్వామి బద్దం ప్రభాకర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డిలు ఆలపించిన గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వందలాది మహిళలతో పాటు పురుషులు హాజరై అయ్యప్ప పడిపూజలో ప్రత్యేక పూజలు గావించారు. ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ జి.వి.రమణ, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌లతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

● అంగరంగ వైభవంగా అయ్యప్పకు అభిషేకం

తాంసి: మండల కేంద్రమైన తాంసిలో సోమవారం మధ్యాహ్నం అయ్యప్పల పడిపూజ ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన గుగుళ్ల పొచ్చన్న దంపతులు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామానికి చెందిన 49 మంది అయ్యప్ప స్వాములే కాకుండా గిరిగావ్, ఆదిలాబాద్ ప్రాంతాలకు చెందిన పలువురు అయ్యప్ప స్వాములు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా గణపతికి అభిషేకం నిర్వహించిన అనంతరం సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామికి 18 పదార్థాలతో ప్రత్యేక అభిషేకాన్ని ఏర్పాటు చేశారు. చివరకు 18 మెట్లు వెలిగించి పడిపూజను ముగించారు. సతీష్ గురుస్వామి వేద మంత్రాలతో పూజను నిర్వహించారు. పడిపూజలో గురుస్వాములు గంగారెడ్డి, పోచారెడ్డి, నరేష్, కృష్ణ పాల్గొన్నారు. తాంసికి చెందిన రాజన్న, పరమేశ్వర, కిసాన్, గురు స్వాములు పాడిన భక్తి గీతాలు ఎంతో ఆకట్టుకున్నాయి. అనంతరం భిక్షను ఏర్పాటు చేశారు.

● ఘనంగా అయ్యప్ప పల్లకీ సేవ

తాంసి, జనవరి1: మండలకేంద్రంలో అయ్యప్ప నామస్మరణలతో మార్మోగింది. సోమవారం ఉదయం నుంచి గ్రామంలో అయ్యప్ప భక్తులు అయ్యప్ప సేవ పల్లకీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేళ వాయిద్యాలు మధ్యస్వాములు భక్తి గీతాలు ఆలపిస్తూ గ్రామంలోని పురవీధుల గుండా అయ్యప్ప స్వామిని పల్లకీలో ఊరేగింపు నిర్వహించారు. స్వామియే శరణమయ్యప్ప అంటూ ప్రతీ ఇంటికి వెళ్లి అయ్యప్ప దర్శన భాగ్యాన్ని కల్పించారు. గురుస్వాములు పోచ్చా రెడ్డి, ఎల్మా గంగారెడ్డి, నరేష్ రెడ్డి, వసంత్, రాజన్న కాంతరెడ్డి, దేవ రెడ్డిలతో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల ఇంటి గడప వద్దకు వెళ్లిన అయ్యప్ప స్వామిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకొని పల్లకిలో ప్రతిష్ఠించిన అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రామేశ్వర ఆలయంలో మంగళ హారతినిచ్చి పల్లకి సేవ కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని గ్రామస్థులు ఎలాంటి పనులకు వెళ్లకుండా అయ్యప్ప సేవ పల్లకీలో పాల్గొన్నారు.


మంత్రిని కలిసి వినతిపత్రం అందిస్తున్న సంఘం నాయకులు

మంత్రిని కలిసిన నాల్గో తరగతి ఉద్యోగులు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి1: తెలంగాణ రాష్ట్ర నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం నూతన కమిటీ సభ్యులు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో సోమవారం మంత్రిని కలిసిన రాష్ట్ర నూతన కార్యవర్గం సభ్యులు మంత్రి పదవి చేపట్టినందుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి సంఘం సభ్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తమ సమమస్యలను మంత్రికి విన్నవించగా.. మంత్రి దీనికి సానుకూలంగా స్పందించి తమ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గడ్డంజ్ఞానేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరి గంగాధర్, నాయకులు ధాస్యనాయక్, ఖాదర్బి నహాస్సెన్, రాజేందర్, ధనరాజ్, లక్ష్మణ్‌రాజ్, సాంబన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ భవన్‌లో న్యూయర్ వేడుకలు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 1: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని జిల్లాకేంద్రంలోని కంది శ్రీనివాస్‌రెడ్డి ప్రజాసేవ భవన్‌లో వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డిని పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విభేదాలు పక్కన పెట్టి.. సమాజాభివృద్ధికి పాటుపడాలి : ఆదివాసీ పర్ధాన్

మావల, జనవరి 1: విభేదాలను పక్కన పెట్టి అందరూ ఐక్యంగా ఉంటూ సమాజాభివృద్ధికి పాటుపడాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లాకేంద్రంలోని పిట్టల్‌వాడలో గల ఆదివాసీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అభివృద్ధి చెందాలంటే ఐక్యతను చాటావాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగానే మండల స్థాయి, డివిజన్ స్థాయి ఆదివాసీ పర్ధాన్ సమాజ్ కమిటీలను ముందుగా నియమించాలన్నారు. ఈనెల 7నుంచి కమిటీలను నియమించాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అలాగే ఫిబ్రవరి మాసంలో జరిగే హీరాసుక్కా జయంతి విజయవంతం కోసం అందరూ కలిసి కట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అడ్‌హక్ కమిటీని నియమించడం జరిగిందన్నారు. కమిటీ సభ్యులుగా పూసం ఆనందారావు, కుర్సేంగే తానాజీ నైతం శుక్లాల్, పూసం ప్రభాకర్, గేడం మాధవ్, సెడ్మ కి సుభాష్, గేడం విఠల్, మెస్రం ఈశ్వర్, మడావి దిగంబర్, మెస్రం భాస్కర్, ఆత్రం అనుసూయ, గంగాదేవిలను నిరయమించడం జరిగిందని పేర్కొన్నారు. మండల స్థాయి కమిటీల నియమాకంలో భాగంగా ఈ నెల 7న బేల, జైనథ్, 9న తాంసి, తలమడుగు, 11న ఆదిలాబాద్, గుడిహత్నూర్, 12న భీంపూర్ మండలాల కమిటీల నియమాకం చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో సమాజ్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు మెస్రం శంకర్, కోవ విజయ్, వెట్టి దేవిదాస్, పూసం రామకాంత్, గేడం శివకృష్ణ, తదితరులు ఉన్నారు.

'హమాలీల సమస్యల పరిష్కారానికి చర్యలు'

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 1: సెంట్రల్ వేర్ హౌజింగ్ కార్పొరేషన్‌లోని హమాలీల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకో వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ డిమాండ్ చేశారు. హమాలీలు ఏఐటీయూసీలో చేరిన తర్వాత సీడబ్ల్యూసీ వద్ద ఏర్పాటు చేసిన జెండాను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హమీలీలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అతిథులను హమాలీలు శాలువ పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్రకార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ సీడబ్ల్యూసీలో పని చేస్తున్న కార్మికులకు అనేక సమస్యలు న్నాయన్నారు. వాటి పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఉద్యమిస్తుందన్నారు. ఇందులో సీడబ్ల్యూసీ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్, ప్రధాన కార్యదర్శి చౌహాన్, ఉపాధ్యక్షుడు సాంబాజీ, సహాయ కార్యదర్శి గోపాల్, అబ్దుల్‌కలాం, తదితరులున్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్

మాజీ ఎంపీకి న్యూ ఇయర్ శుభాకాంక్షలు

బోథ్, జనవరి 1: బోథ్ మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మాజీ ఎంపీ జి నగేష్‌కు పలు గ్రామాల సర్పంచులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాజీ ఎంపీని శాలువాతో సన్మానించి బోకేను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు పాల్గొన్నారు.

బోథ్: తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును కలిసి బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం అయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని సూచించడం జరిగిందని ఎంపీపీ పేర్కొన్నారు.

తగ్గుముఖం పడుతున్న చలి

● బజార్‌హత్నూర్‌లో 11.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

ఆదిలాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): డిసెంబర్ ముగిసిపోవడంతోయ క్రమంగా చలి తీవ్రత కూడా తగ్గుముఖం పడుతుంది. సోమవారం ఆదిలాబాద్ జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు 29.8 డిగ్రీలుగా నమోదు కాగా కనిష్ట ఉష్ణోగ్రతలు 13.2 డిగ్రీలుగా నమోదయ్యాయి. అత్యల్పంగా బజార్‌హత్నూర్ మండలంలో 11.4 కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా బోథ్‌లో 11.6,బేలలో 12.2, ఇచ్చోడలో12.8, నేరడిగొండలో 13.1కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా అన్నిచోట్ల 10డిగ్రీలకు పైగానే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో రాత్రి ఉష్ణోగ్రతల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడంతో చలితీవ్రత తగ్గుతుందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. సంక్రాంతి పండుగ వరకు ఇదే స్థాయిలో చలి ప్రభావం ఉంటుందని చెబుతున్నారు.


గ్రామాల్లో రోడ్లపై కమ్ముకున్న పొగమంచు

మహనీయుల ఆశయ సాధనకు పాటుపడాలి

● మాజీ మంత్రి జోగు రామన్న ● ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఘనంగా భీమా కోరేగావ్ శౌర్య దివాస్ ● పాల్గొని నివాళ్లు అర్పించిన రాజకీయ, ప్రజా, దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు

ఆదిలాబాద్ అర్బన్/మావల, జనవరి1: మహనీయుల జీవిత చరిత్రలను భావితరాలకు తెలియజేసి వారి ఆశయ సాధనకు పాటుపడాలని మాజీ మంత్రి జోగు రామన్న సూచించారు. జిల్లా కేంద్రంలోని బుద్ధ విహార్‌లో నిర్వహించిన భీమా కోరేగావ్ శౌర్యదివాస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 1818లో జరిగిన యుద్ధంలో అమరులైన వీరులకు ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ భీమర్ అంబేద్కర్, బౌద్ధుడి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అనంతరం మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ భీమాకోరేగావ్ యుద్ధంలో అసువులు బాసిన అమరుల త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. మహనీయుల ఆశయ స్ఫూర్తిని భావితరాలకు తెలియజేసి సమాజ అభ్యున్నతికి పాటు పడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేష్, మెట్టు ప్రహ్లాద్, నేతకాని మహార్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దుర్గం శేఖర్, మెట్టు ప్రహ్లాద్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, ప్రతీఒక్కరు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని, ఆయన ఆశయాలను కొనసాగించాలని ఆదిలాబాద్ అసెంబ్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అంబేద్కర్‌చౌక్‌లో భీమా కోరేగావ్ శౌర్య దివాస్‌ను దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహంతో పాటు పోరాటవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితులు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


సోనాలలో అంబేద్కర్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహిస్తున్న సభ్యులు


ఆదిలాబాద్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న రామన్న

మావల: ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ మావల మండల కమిటీ ఆధ్వర్యంలో భీమా కోరేగాం శౌర్య దివాస్‌ను ఆదివాసీనాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని కొమురం భీం కాలనీలో భీమా కోరేగాం శౌర్య దివాస్ భీమా కోరేగావ్ యుద్ధ విజయోత్సవ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ నాయకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఇందులో రాష్ట్ర కార్య నిర్వాహణ అధ్యక్షులు గోడం గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, ఆదివాసి మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఉయిక ఇందిర, ఆత్రం గణపతి, శాంతాబాయి, తదితరులు పాల్గొన్నారు.

● దళితుల ఆత్మ గౌరవ పోరాట విజయమే భీమా కోరేగావ్

ఇంద్రవెల్లి: దళితుల ఆత్మగౌరవ పోరాట విజయమే భీమా కోరేగావ్ అని మానవ హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం సుగుణ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్, భారతీయ బౌద్ధ మహా సభ, భీం ఆర్మీ ఆధ్వర్యంలో సోమవారం భీమా కోరేగావ్ శౌర్య దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చౌక్‌లో దళితులు, దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భీమా కోరేగావ్‌లో 1818 జనవరి 1న జరిగిన యుద్ధంలో వీర మరణం పొందిన అమరులైన మహార్ సైనికుల అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇందులో జడ్పీటీసీ పుష్పలత, ఎంపీటీసీ గిత్తే ఆశాబాయి, మాజీ సర్పంచ్ కోరెంగ సుంకట్‌రావు, భీం ఆర్మీ మండల అధ్యక్షుడు సూర్యవంశీ, ఉత్తం, అంబేద్కర్ మోమోరియల్ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి వాగ్మార్ కామరాజ్, తదితరులు ఉన్నారు.


ఇంద్రవెల్లిలో సమావేశంలో మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

బోథ్: మండల కేంద్రంలో సోమవారం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో భీమా కోరేగావ్ విజయ్ దివాస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ర్యాలీగా వెళ్లిన సంఘం సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి భీమా కోరేగావ్ స్థూప పటానికి పూలమాలలు వేశారు. ఇందులో భగత్ ప్రవీణ్, సంజయ్, అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షుడు రమేష్, బత్తుల మద్దెల మహేష్, రాజేందర్, సోమన్న, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీమా కోరేగావ్ శౌర్య దినోత్సవం

భైంసా రూరల్, జనవరి 1 : మండలంలోని పేండ్‌పల్లి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం పేండ్‌పల్లి, బీఎస్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం 206వ భీమా కోరేగావ్ యుద్ధ విజయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా డా. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి, అమరవీరుల స్తంభం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... భీమా నది ఒడ్డున యుద్ధంలో 28 వేల మంది పీష్వా సైనికులతో కేవలం ఐదు వందల మంది మహర్ సైనికులు వీర పోరాటం చేసి విజయం సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం పేండ్‌పల్లి అధ్యక్షులు బాకొల్ల మోహన్, బీఎస్‌ఐ భైంసా అధ్యక్షులు ప్రసంజీత్ హేమ్లే, పేండ్‌పల్లి సభ్యులు గంగాధర్, గోపి, ఎల్లన్న, భోజన్న, పెద్ద సాయన్న, బౌద్ధ ఉపాసకులు, బౌద్ధ చార్యులు, దమ్మ అభిమానులు, సమస్త బౌద్ధ, అంబేద్కర్ సంఘాల నాయకులు, పదాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సర సంబురాలు

నిర్మల్ కల్చరల్, జనవరి 1 : జిల్లా కేంద్రంలో ఆంగ్ల సంవత్సర 2024 వేడుకలు ప్రజలు ఘనంగా సోమవారం జరుపుకున్నారు. 2023కు ఆదివారం రాత్రి 12 గంటల వరకు యూత్, విద్యార్థులు, ప్రజలు స్నేహితులతో సంబరాలు జరుపుకున్నారు. రాత్రి 12 గంటలకు కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. అర్ధరాత్రి వరకు పార్టీలు చేసుకున్నారు. వాడవాడలో కేక్ కట్ చేశారు. న్యూ ఇయర్ డే వేడుకలు జరుపుకున్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా వేడుకల్లో పాల్గొన్నారు. శుభాకాంక్షలు చెప్పుకున్నారు. న్యూ ఇయర్‌లో అన్ని మంచి జరుగాలని కోరుకున్నారు. సోమవారం పలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్ కేక్ కట్ చేశారు. కొత్త సంవత్సరం ప్రజల జీవితాల్లో ఆనందం పంచాలని, సుఖ శాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. నాయకులు రవి, మహమ్మద్ షఫీ, ఇలియాస్, ఇమ్రాన్, కరీం, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : మండల ప్రజలు నూతన సంవత్సర వేడుకలను సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా గ్రామాల్లో గల ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. ఇంటిల్లిపాదితో పాటు అందరూ సుఖసంతోషాలతో జీవించాలని వేడుకున్నారు. ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్‌లు మండల ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అయోధ్య రాములవారి అక్షింతల పంపిణీ


అక్షింతలతో శోభాయాత్ర


కల్లూర్‌లో అయోధ్య అక్షింతల ఊరేగింపు

నిర్మల్ కల్చరల్, జనవరి 1 : రామ జన్మ భూమి ట్రస్ట్ అయోధ్య నుంచి పంపిన రాములవారి అక్షింతలు ఆదివారం ఇంటింటికి పంపిణీ చేశారు. సోమవారం ఉమా మహేశ్వర ఆలయంలో ఆలయ అధ్యక్షుడు శాంతిలాల్ పాటిల్, మంచిర్యాల నాగభూషణం, కాలనీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు జరిపారు. అయ్యన్నగారి శ్రీధర్, జి. ప్రభు, చరణ్, టి. నారాయణ, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

బాగులవాడలో అక్షింతల శోభాయాత్ర

నిర్మల్‌లోని భాగ్యనగర్‌లో సోమవారం అయోధ్య నుండి వచ్చిన అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. రామాలయం నుండి హనుమాన్ ఆలయం వరకు జరిగిన శోభాయాత్రలో మహిళలు మంగళ హారతులతో హాజరయ్యారు. రామ జన్మ భూమి తీర్థ క్షేత్ర కమిటీ సభ్యుడు రాంనాథ్ మాట్లాడుతూ... ఐదు వందల సంవత్సరాల పోరాట ఫలితంగా ప్రధాని మోదీ నేతృత్వంలో ఈ మందిర నిర్మాణం జరిగిందని ఈ నెల 22న ప్రతిష్ఠాపన కార్య క్రమం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ఎదుట 22న ముగ్గులు వేసి పూజలు నిర్వహించాలన్నారు. శంకర్, అల్లం భాస్కర్, చిన్నయ్య, సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

కుంటాల : మండంలోని కల్లూర్‌లో సోమవారం అయోధ్య పూజిత అక్షింతలను గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు అధిక సంఖ్యలో మంగళహారతులతో పాల్గొనగా, బ్యాండుమేళాలలో యువకులు గ్రామస్తులు పాల్గొని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. త్వరలోనే గ్రామస్థులందరికీ అక్షింతలు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

మాటేగాంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



భైంసా రూరల్ : మండలంలోని మాటేగాం గ్రామానికి చేరుకున్న అక్షింతల శోభాయాత్ర వైభవంగా జరిగింది. రాముడి విగ్రహం పల్లకిని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గ్రామంలోని కర్ర వినాయకుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నర్సాపూర్(జి) : మండలం కేంద్రంలోని రామాలయానికి సోమవారం రామయ్య అక్షింతలు చేరుకున్నాయి. గ్రామ ప్రజలు మంగళ హారతులతో స్వాగతం పలికారు.





క్యాంపు కార్యాలయ సిబ్బందితో కలిసి కేక్ కట్ చేస్తున్న కలెక్టర్



క్యాంపు కార్యాలయంలో సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేస్తున్న ఎస్పీ

పార్లమెంట్‌పై.. గురి



- జిల్లాలో లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్న బీఆర్ఎస్
- రేపు హైదరాబాద్‌లో జిల్లా ముఖ్య నేతలతో సన్నాహక సమావేశం
- తెరపైకి వస్తున్న గోడం నగేష్, ఆత్రం సక్కుల పేర్లు
- బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెక్ పెట్టేందుకే ముందస్తు వ్యూహం
- ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంపై అధిష్ఠానం ప్రత్యేకదృష్టి

ఆదిలాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో అధికారానికి దూరమైన బీఆర్ఎస్ పార్టీ ఇక పార్లమెంట్ ఎన్నికలపై ప్రత్యేక దృష్టిని సారిస్తుంది. ఈసారి షెడ్యూలు ప్రకారమే పార్లమెంట్ ఎన్నికలు జరుగుతాయని ప్రచారం జరుగడంతో అప్రమత్తమైంది. ఎన్నికల సంఘం అవసరమైన ఏర్పాట్లను కూడా చేస్తుంది.ఇటీవలే జిల్లా కలెక్టర్లతో కేంద్ర ఎన్నికల సంఘం సమావేశాన్ని నిర్వహించింది. ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధం కావడంతో ఇక ప్రధాన పార్టీలు ఎన్నికలపై దృష్టి సారిస్తున్నాయి. ఈనెల 3 నుంచి బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికలపై సన్నాహక సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించింది. మొదట ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలోని ముఖ్య నేతలతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించే సమావేశానికి తరలివెళ్లేందుకు జిల్లా నేతలు సిద్ధమవుతున్నారు. ఎమ్మెల్యేలు, జడ్పీ ఛైర్మన్లు, తాజా మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు సన్నాహక సమావేశానికి హాజరుకానున్నారు. ఈసారి ఎలాగైనా గెలిచి తీరాలనే పట్టుతో బీఆర్ఎస్ కనిపిస్తోంది.

నియోజకవర్గానికి 70 మంది

హైదరాబాద్‌లో నిర్వహించే పార్లమెంట్ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశానికి ఉమ్మడి జిల్లా నేతలు తరలి వెళ్లనున్నారు. పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాల నుంచి పలువురు ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలు సమావేశానికి హాజరుకానున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి 70 మంది హాజరు కావాలని అధిష్ఠానం ఆదేశించింది. సుమారుగా ఉమ్మడి జిల్లా నుంచి 500 మంది నేతలు సమావేశానికి హాజరుకానున్నారు. బుధవారం ఉదయం 11గంటలకు హైదరాబాద్ బయలుదేరి వెళ్లనున్నారు. ఇప్పటికే జిల్లా పార్టీ అధ్యక్షుడు సమావేశానికి హాజరయ్యే నేతల జాబితాను సిద్ధం చేశారు. ప్రత్యేక వాహనాలలో హైదరాబాద్ తరలి వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఆదివాసీ నేతలకే అవకాశం

ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం ఎస్టీ రిజర్వ్‌డు కావడంతో ఈసారి కూడా బీఆర్ఎస్ పార్టీ ఆదివాసీ నేతలకే అవకాశం ఇవ్వాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తుంది. గత ఎన్నికల్లో గోడం నగేష్‌కు అవకాశం ఇచ్చినా.. ఆయన ఓటమి పాలయ్యారు. బీజేపీ అభ్యర్థి సోయం బాపురావు గెలువడంతో రెండో స్థానానికే పరిమితమయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 35.92 శాతం, బీజేపీకి 34.64 శాతం, కాంగ్రెస్‌కు 19.47 శాతం ఓట్లు దక్కాయి. దీంతో మెజార్టీ ఓట్లను దక్కించుకున్న బీఆర్ఎస్ గెలుపుపై భారీ ఆశలు పెట్టుకుంది. పార్లమెంట్ పరిధిలో కేవలం రెండు అసెంబ్లీ స్థానాలను మాత్రమే గెలిచిన బీఆర్ఎస్.. మిగితా ఐదు సెగ్మెంట్లలో గెలుపు అంచుల వరకు వెళ్లి ఓటమి పాలైంది. అయితే మాజీ ఎంపీ గోడం నగేష్, ఆసిఫాబాద్ తాజా మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుల పేర్లు తెరపైకి రావడంతో అధిష్ఠానం వారి ఇద్దరి పేర్లనే ప్రధానంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

అభ్యర్థి ఎంపికనే ప్రధానం

అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా దెబ్బతిన్న బీఆర్ఎస్.. గత పరిస్థితులు పునరావృతం కాకుండా జాగ్రత్త పడుతోంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెక్‌పెట్టే ముందస్తు వ్యూహంతో ముందుకెళ్లాలని భావిస్తోంది. పార్లమెంట్ స్థానం పరిధిలో ముఖ్య నేతలెవరూ చేజారీ పోకుండా జాగ్రత్త పడుతోంది. అయితే ఇటీవల ఉమ్మడి జిల్లా డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం ఆ పార్టీలో కలకలం రేపుతోంది. గత ఎన్నికల్లో బీజేపీ పార్టీకి చెందిన అభ్యర్థి విజయం సాధించడం, ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్‌కు కొంత ఇబ్బందికరంగానే మారంది. అధికారం లేక పోవడంతో దీటైన అభ్యర్థిని ఎన్నికల బరిలో దింపాలని భావిస్తోంది. అయితే అధికార పార్టీకి దీటైన అభ్యర్థిని బరిలో దింపడం అనుమానంగానే కనిపిస్తోంది. మొత్తానికి అభ్యర్థి ఎంపికనే ఈసారి ప్రధానమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



గోడం నగేష్

ఆత్రం సక్కు

కలెక్టర్, ఎస్పీలకు న్యూ ఇయర్ శుభాకాంక్షల వెల్లువ

ఆదిలాబాద్ అర్బన్, జనవరి1: జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా సంఘాల నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయ సిబ్బందితో కలిసి కేకట్ చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే పాయల శంకర్ కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు నూతన సంవత్సరల శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరేలా చర్యలు తీసుకుంటూ పారదర్శకంగా అందిస్తామన్నారు. అధికారులు ఆ దిశగా కృషి చేయాలని కోరారు. అదే విధంగా జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పోలీసులతో కలిసి క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పాయల శంకర్ నాయకులతో కలిసి ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా శాంతి భద్రతలపై చర్చించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఈ సంవత్సరం నేరాల నియంత్రణతో పాటు శాంతి భద్రతలను కాపాడేల పోలీసులు విధులు నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పకడ్బందీ ప్రణాళికలతో శాంతి భద్రతల పరిరక్షణ : ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్: 2024 సంవత్సరం నూతన ఆలోచనలు, సమష్టి కృషి, సిబ్బంది విధుల పట్ల అంకిత భావంతో పని చేస్తూ జిల్లా పోలీసు కీర్తిని మరింత పెంపొందించే విధంగా పకడ్బందీ ప్రణాళికతో శాంతి భద్రతలను పరిరక్షిస్తామని ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆంగ్ల నూతన సంవత్సరం వేడుకలను జిల్లా ఎస్పీ క్యాంపుకార్యాలయంలో, స్థానిక పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఇతర శాఖల ఉన్నతాధికారులు జిల్లా ఎస్పీని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో డీఎస్పీలు ఉమేందర్, నాగేందర్, సీఐలు సత్యనారాయణ, అశోక్, సైదరావు, ప్రేమ్ కుమార్, నరేష్, భీమేష్, చంద్రశేఖర్, రామకృష్ణ, రవీందర్, సాయినాథ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మురళి, నవీన్, స్వామి, సీసీ దుర్గం శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై అన్వర్‌ఉల్‌హక్, రిజర్వ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడలో విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

గురుకుల బాలుర విద్యార్థుల ప్రతిభ

ఇచ్చోడ, జనవరి1: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారాంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో ఇచ్చోడ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన శ్రీకాంత్ ఓవరాల్‌లో బంగారం పతాకాన్ని సాధించారు. ఇంటర్ సొసైటీ లీగ్‌లో అర్హత సాధించాడు. ఫుట్‌బాల్‌లో గంగాప్రసాద్, శేఖర్, లోకేష్, లక్ష్మణ్‌లు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉమ్మడి జిల్లా గురు కులాల సమన్వయకర్త గంగాధర్, సిబ్బంది హరిరాం, పీడీ దిలీప్‌లు అభినందించారు.

గ్రామాలకు అయోధ్య రాముడి అక్షింతలు

జైనథ్, జనవరి 1: దేశంలోని అయోధ్యలో ఈ నెల 22వ తేదీన శ్రీరాముడి నిలువెత్తు విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేసి అయోధ్య శ్రీరామమందిరం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా జైనథ్ మండలంలోని తరోడ, గిమ్మా గ్రామాలకు అయోధ్య శ్రీరాముని అక్షింతలు జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్ నుంచి సోమవారం చేరుకున్నాయి. ఈ అక్షింతలు గిమ్మా తరోడ గ్రామాల ప్రజలు తల పై పెట్టుకుని డప్పుల భజాలతో పాటు భజన సంకీర్తనలు పలు వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.



గిమ్మా రామాలయంలో భజనలు చేస్తున్న గ్రామస్థులు

సంక్షిప్త సమాచారం



ప్రారంభమైన మార్నింగ్ లగ్జరీ సర్వీసు

హైదరాబాద్‌కు ఆర్టీసీ లగ్జరీ బస్సు

ఉట్నూర్, జనవరి 1: ఉట్నూర్ ఆర్టీసీ అధికారులు ఉట్నూర్ ప్రాంత ప్రయాణికుల కోసం హైదరాబాద్‌కు ఉదయం సర్వీసును అందుబాటులోకి తెచ్చారు. ప్రతీరోజు ఉదయం ఉట్నూర్ నుంచి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సును కొత్త సంవత్సరంలో ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం వేకువజామున 5గంటలకు ఉట్నూర్ నుంచి హైదరాబాద్‌కు సూపర్ లగ్రీ బస్సును నడుపుతున్నామన్నారు. ఈ సర్వీస్ వల్ల కరీనగర్, హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు వెసులుబాటు లభిస్తుందన్నారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలోని జైనూర్ నుంచి కూడా హైదరాబాద్‌కు రాత్రి 1 గంటలకు ఒక బస్సును ప్రారంభించామని ఈ బస్సు ఉట్నూర్ బస్టాండ్‌కు రాత్రి 10.30కి చేరుకుని హైదరాబాద్ బయలుదేరుతుందని తెలిపారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

ఇంద్రవెల్లి, జనవరి 1: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహిస్తునట్లు ఏపీవో జాదవ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆవరణలో జరిగే ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదికలో మండలంలోని 28 పంచాయితీల్లో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు జరిగిన పనులపై తనిఖీ బృందం గుర్తించిన అంశాలపై ప్రజా వేదిక జరుగుతుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

4న తాంసిలో ప్రజా పాలన

తాంసి, జనవరి 1: తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఈనెల 4న మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో భూమయ్య తెలిపారు. గ్రామంలో సుమారు 700 కుటుంబాలకు గాను ఏడు కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో తెలపాలన్నారు. దరఖాస్తులు సమర్పించే విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని, ఏ సమాచారం కావాలన్నా సంబంధిత సిబ్బంది తెలియజేస్తారని, మండల కేంద్రంలోని పాత జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.


బాధితుడికి పరామర్శ

మావల, జనవరి 1: హత్యాయత్నంలో గాయపడిన యువకుడిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పరామర్శించారు. ఇటీవల మావలలో రోడ్డు ప్రమాదం చేసి హత్య చేసేందుకు యత్నించగా, ప్రమాదంలో గాయపడిన వంశీ అనే యువకున్ని మాజీ మంత్రి రామన్న సోమవారం యువకుని ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

కోలాం గిరిజనుల నీటి గోస

- గుక్కెడు నీటి కోసం వ్యవసాయ క్షేత్రాల్లోని బోరుబావుల వద్దకు పరుగులు
- వృథాగా మారిన 'మిషన్ భగీరథ' నీటి ట్యాంకులు

భీంపూర్, జనవరి 1: ప్రభుత్వాలు మారినా.. ఆ గిరిజన గ్రామ పంచాయతీలో నీటి గోస తప్పడం లేదు. గుక్కెడు నీటి కోసం వ్యవసాయ క్షేత్రాల్లోని బోరుబావుల వద్దకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వాలు తమ నీటి గోసను పట్టించుకోలేదని, ఈసారైనా కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే.. భీంపూర్ మండలం కోలాం గిరిజనులు తరాలుగా తాగునీటి ఇబ్బంది పడుతున్నారు. ఇంటింటికి భగీరథ నీళ్లు అని చెప్పిన కొత్త సర్కారు కూడా ఇక్కడ నీటి కోసం శాశ్వత పరిష్కారం చేయలేకపోయింది. మిషన్ భగీరథ నీటి ట్యాంకు ఉన్న నెలలుగా నీరు రాని పరిస్థితి దీంతో ఇప్పుడు మహిళలు కిలో మీటర్లు నడిచి వాగు నుంచి బావి నుంచి నీళ్ళు తెచ్చుకుంటున్నారు. ఈ అపరిశుభ్రం అయిన నీరే తాగడానికి వంటలకు వాడుతున్నారు. నీటి సమస్యతో ఇక్కడ రోజు స్నానాలు చేయటం కుదరటం లేదని స్థానికులు కన్నీటితో చెప్పారు. ఈ సంగతి ఎలా ఉంటే గుంజాలలో ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రచారంకు వచ్చిన అనిల్ జాదవ్ అప్పట్లో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు హామీనిచ్చారు. అదైన త్వరగా జరిగితే ఇప్పటికీ కొంత మేలవుతుందటున్నారు. అయితే జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే శ్రద్ధ తీసుకుని గుంజల నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉందంటున్నారు.



స్థానిక గిరిజన తండాలో బావిలో కలుషిత నీరు



గుంజలలో నీటి కోసం ఖాళీ డ్రమ్ములతో రైతులు బారులు



మంచినీటి కోసం ఎడ్ల బండిపై వెళ్తున్న బాలుడు

ఎమ్మెల్యేలకు పలువురు నాయకుల శుభాకాంక్షలు

న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 1: 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలను ఎమ్మెల్యే పాయల శంకర్‌కు పలువురు ప్రజా ప్రతినిధులు, కుల సంఘాల ప్రతినిధులు కలిసి తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే నివాసంలో పలువురు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ టీఎస్ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ 2023కు వీడ్కోలు పలుకుతు 2024లో అడుగు పెట్టామన్నారు. అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితో ఈ సంవత్సరంలో నియోజక వర్గంతో పాటు పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుంటామని స్పష్టం చేశారు.

బోథ్: నియోజకవర్గ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కు బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం సర్పంచ్‌తో పాటు పలువురు నాయకులు ఆయన స్వగృహానికి వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు తినిపించారు. సర్పంచ్ వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోలంకి సత్యనారాయణ, ఎలుక రాజు, తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రికి పలువురి శుభాకాంక్షలు

మావల: మాజీ మంత్రి జోగు రామన్నకు నూతన సంవత్సర శుభాకాంక్షలు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు పట్టణ, వివిధ మండలాలకు చెందిన ఎంపీపీలు, జడ్పీటీసీ లు సర్పంచ్‌లు, పార్టీ నాయకులు మాజీ మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో మాజీ మార్కెట్ ఛైర్మన్ ప్రహ్లాద్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, సెవ్వ జగదీష్ యాదవ్, సాజీదుద్దీన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా మండలంలోని జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణలక్ష్మి రాజేశ్వర్‌లు ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, ఎంపీ సోయం బాపురావు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, ఇతర ప్రజాప్రతినిధులను అధికారులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే పాయలకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



ఎమ్మెల్యే అనిల్‌కు స్వీట్ తినిపిస్తున్న సర్పంచ్, నాయకులు